సాక్షి మెదక్

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



విష ప్రయోగమా.. ఆత్మహత్యా?

సిద్దిపేట జిల్లా నంగునూరులో వృద్ధ దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వివరాలు 8లో ▸



పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని పర్యావరణ వేత్త, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం సూచించారు. వివరాలు 8లో ▸



నిలిచిన హైవే పనులు

అధికారుల సమన్వయ లోపంతో మెదక్- ఎల్లారెడ్డి హైవే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వడ్లకుప్పలను ఢీకొనడంతో ప్రమాదం



నిజాంపేట (మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాలాపూర్‌కు చెందిన అబ్దుల్ రహ్మాన్ (50) ఫోన్ రావడంతో చేగుంట మండలం పులిమామిడికి బైక్‌పై బయలుదేరాడు. గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న వడ్ల కుప్పలను ఢీకొనడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో ప్రాణాలొదిలాడు. రహ్మాన్ మరణ వార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చదవడం, రాయడం తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): విద్యార్థులకు చదవడం రాయడం వచ్చేలా శిక్షణ ఇవ్వాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలంలోని వడియారం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదవడం, రాయడం ఖచ్చితంగా రావాలన్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలకు అనుగుణంగా బోధించాలని సూచించారు. తొలిమెట్టు మూల్యాంకన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. డీఈఓ వెంట ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు వసంత, సంతోషిమాత తదితరులు ఉన్నారు.

సమగ్ర వివరాలు నమోదు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

శివ్వంపేట(నర్సాపూర్): రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు సంబంధించి సమగ్ర వివరాలు నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. గురువారం శివ్వంపేట ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను కార్యాలయంలో తీసుకునేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాలు నమోదుకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటుచేయాలన్నారు. అలాగే ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ స్వామి, ఏపీఓ అనిల్‌కుమార్ ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

రామాయంపేట(మెదక్): నాసిరకం విత్తనాలు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ హెచ్చరించారు. గురువారం రైతు వేదికలో డివిజన్ పరిధిలోని రామాయంపేట, నిజాంపేట, చేగుంట, నార్సింగి మండలాలకు చెందిన విత్తనాలు, క్రిమి సంహారక మందుల డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విత్తన చట్టాలకు లోబడి డీలర్లు వ్యాపారం నిర్వహించుకోవాలని, నెలవారీ నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. విత్తనాలు, క్రిమి సంహారక మందులకు సంబంధించి అమ్మకాలు, నిల్వల వివరాలను ప్రతినెల తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. ఏఓలు సోమలింగారెడ్డి, యాదగిరి, ఏఈఓ ప్రవీణ్, డీలర్లు పాల్గొన్నారు.

మహనీయుడు వాజ్‌పేయి

మెదక్‌జోన్: దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి గొప్ప నేత అని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి శత జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు, బూత్ అధ్యక్షులు నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నేతలు శివ, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కూల్.. కూల్



శివ్వంపేటలో కురుస్తున్న వర్షం

జిల్లాలో గురువారం పలు చోట్ల వర్షం కురిసింది. మధ్యాహ్నం ప్రారంభమై అడపాదడపా పడుతూ రాత్రి వరకు కొనసాగింది. శివ్వంపేటలో అత్యధికంగా 3 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఉరుములతో కూడిన భారీ వర్షం గంట పాటు కురిసింది. పెద్దశంకరంపేట సంతలో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరుతడి పంటలకు వర్షం జీవం పోయగా.. వరి సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అయితే ఎండల తీవ్రతకు ఉక్కపోతతో అల్లాడిన వారికి ఉపశమనం లభించింది. ఇదిలా ఉండగా జిల్లాకు వాతావరణశాఖ అరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. – మెదక్‌జోన్

సొంతింటి కల నెరవేరేనా..!

- ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలో నిర్మించిన 688 ఇళ్లు పంపిణీకి సిద్ధం
- వాటి ఊసే ఎత్తని పాలకులు, అధికారులు
- ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

పేద, మధ్య తరగతి ప్రజలను ఊరిస్తున్న సొంతింటి కల అందని ద్రాక్షగానే మారింది. గత ప్రభుత్వంలో 688 డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ పంపిణీకి నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పట్టించుకోవడమూ లేదు. ఈ క్రమంలో సొంతింటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకాన్ని ప్రకటించింది. దీంతో ఎంతో మంది అర్హులు అర్జీలు పెట్టుకున్నారు. అయితే ఆ ప్రక్రియ సైతం ముందుకు సాగడం లేదు. – మెదక్‌జోన్



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

జిల్లాలో దశాబ్ద కాలంగా ప్రభుత్వం పేదలకు సరిపడా ఇళ్లు మంజూరు చేయలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు 4,776 డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేసింది. వాటిలో 3,975 ఇళ్లకు మాత్రమే టెండర్ పూర్తయింది. వీటి నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ. 243 కోట్లను విడుదల చేసింది. టెండర్ అయిన వాటిలో 3,011 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా లబ్ధిదారులకు 2,323 ఇళ్లను మాత్రమే పంపిణీ చేసింది. ఈ లెక్కన నిర్మాణాలు పూర్తయినవి మరో 688 ఇళ్లు సిద్ధంగా ఉన్నాయి. వాటికి చిన్నచిన్న మరమ్మతులు మాత్రమే చేయాల్సి ఉంది. అయితే కొత్త ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలపై మాత్రమే దృష్టి సారించింది. ప్రజాపాలనలో ఇళ్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో జిల్లాలో లక్షపై చిలుకు మంది దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆ గ్రామంలోని అర్హులకు ఇళ్లు మంజూరు చేశారు. 21 మండలాల పరిధిలోని 21 గ్రామాలను ఎంపిక చేసి 1,555 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. వారికి జన వరి 26న మంజూరు పత్రాలను అందించారు. అయితే ఇప్పటివరకు మూడు నెలలు అవుతున్నా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. జిల్లాలో 493 గ్రామాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 21 గ్రామాల్లోనే ఈ పథకాన్ని అమలు చేశారు. మిగితా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు పూర్తయిన 688 ఇళ్లను ఎప్పుడు పంపిణీ చేస్తారని అడుగుతున్నారు.

ఆసక్తి చూపని లబ్ధిదారులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపటం లేదని తెలుస్తోంది. మూడు నెలల క్రితం జిల్లాలోని 21 గ్రామాలకు 1,555 ఇళ్లు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 34 మంది లబ్ధిదారులు మాత్రమే బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మించుకున్నారు. మరో 120 మంది పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇంటిలో హాల్, కిచెన్, అటాచ్డ్ బాత్రూమ్ ఉండగా, వాటిని పిల్లర్లతో నిర్మించారు. ఇందిరమ్మ ఇంటిలో కేవలం ఒక బెడ్రూం మాత్రమే ఉండగా, అందులో పిల్లర్లు లేకుండా నిర్దేశించిన డిజైన్‌లోనే కట్టుకుంటే బాగుంటుందని అధికారులు చెబుతు న్నారు. కనీసం 400 చదరపు అడుగుల నుంచి అత్యధికంగా 600 చదరపు అడుగుల వరకు ఇంటిని నిర్మించుకోవాలని సూచిస్తు న్నారు. అయితే 400 చదరపు అడుగుల ఇంటిని నిర్మించుకుంటే ఏ మాత్రం సరిపోదనే భావనతో చాలా మంది లబ్ధిదారులున్నారు.



లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు

సన్న బియ్యం నిరుపేదలకు వరం

కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్)/చిన్నశంకరంపేట: సన్న బియ్యం నిరుపేదలకు వరమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మండలంలో ఎమ్మెల్యే రోహిత్‌రావుతో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 520 రేషన్ షాపులు, 2.13 లక్షల రేషన్‌కార్డులు ఉండగా, 6.96 లక్షల లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. వీరందరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నట్లు ప్రకటించారు. సన్న వడ్లు పెట్టిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ప్రయోజనకారిగా ఉందన్నారు. రాజీవ్ యువ వికాసం స్కీంతో నిరుద్యోగులకు ఉపాధి చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ధనికులు సన్న బియ్యం తింటే, నిరుపేదలు మాత్రం దొడ్డు బియ్యం తినాల్సి వచ్చేదన్నారు. ఈ విధానానికి చెక్ పెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, ఎమ్మార్వో సతీష్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మాజీ జెడ్పీటీసీ మల్లప్ప నాయకులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండల కేంద్రంలో సన్న బియ్యం పథకం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లలో వెనకబడిన మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సివిల్ సప్లై అధికారి సురేష్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులుగా మారొద్దు

కాంగ్రెస్ నేతలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హితవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం ఎవరిదైనా ఎమ్మెల్యేగా తాను ప్రపోజల్స్ పంపిస్తేనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మంజూరు వస్తుందని, అధికార పార్టీ నాయకులకు చేతనైతే అదనపు నిధులు తేవాలి కానీ అభివృద్ధిని అడ్డుకోవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హితవు పలికారు. గురువారం మాసాయిపేట మండలంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. అయితే రెండు రోజుల తర్వాత మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారులు తెలపడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా సమాచారం ఇచ్చి అర్ధాంతరంగా చెక్కుల పంపిణీ నిలిపివేసినందుకు నిరసనగా నియోజకవర్గంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. పక్క నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేస్తున్నారు, నర్సాపూర్‌లో మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నిధుల విడుదలలోనూ ప్రభుత్వం వివక్ష చూపుతుందని ఆరోపించారు. తన హక్కులను కాలరాసేలా ప్రవర్తిస్తే చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, భూపాల్‌రెడ్డి నాయకులు నర్సింలు, నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ మాణిక్యం

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం అన్నారు. గురువారం మండలంలోని దానంపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి 38 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 5 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. మిగితా వారు కూడా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఏఈ విద్యాసాగర్, ఎంపీఓ విఠల్‌రెడ్డికి సూచించారు. అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, వాటికి వెంటవెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, పెరుమాండ్లగౌడ్, పంచాయతీ సెక్రటరీ నరేందర్ పాల్గొన్నారు.

తూప్రాన్ మున్సిపాలిటీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న కమిషనర్ గణేష్‌రెడ్డి

తూప్రాన్: జిల్లాలోనే తూప్రాన్ మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆస్తి పన్ను వసూళ్లలో 82.17 శాతం లక్ష్యాన్ని సాధించింది. ఈసందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి చేతులమీదుగా కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి బెస్ట్ అప్రిషియేషన్ అవార్డు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమష్టి కృషి ఫలితంగానే అవార్డు దక్కిందని తెలిపారు.

బార్ నిర్వహణకు నోటిఫికేషన్

మెదక్‌మున్సిపాలిటీ: మెదక్‌లో బార్ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ. లక్ష డీడీతో పాటు ఆధార్‌కార్డు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో శుక్రవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఓ బార్ యజమాని మూడేళ్లుగా రెన్యూవల్ చేయించుకోనందున అతడి లైసెన్స్ రద్దు చేసి నూతన నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఈనెల 29న కలెక్టర్ డ్రా పద్ధతిన ఎంపిక చేస్తారని తెలిపారు. ఇందులో పాల్గొన్న వారికి తిరిగి డబ్బులు ఇవ్వటం జరగదని స్పష్టం చేశారు.

ఫొటో విధానాన్ని రద్దు చేయాలి

పాపన్నపేట(మెదక్): ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఫొటో హాజరు విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కొడుపాకలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. రోజుకు రెండు సార్లు ఫొటోలు తీయడం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. గ్రూపులో ఒక వ్యక్తి ఫొటో రాకపోతే, ఆ గ్రూపులో ఉన్న కూలీలకు డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 7న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణకు కదలిరావాలి



ర్యాలీలో మెట్టు సాయికుమార్, రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి తదితరులు

వెల్దుర్తి(తూప్రాన్): అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని, దానిని అడ్డుకుని తీరాలని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నాయకులు పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ కబంధహస్తాల కింద దేశం నలిగిపోకుండా కాపాడాలన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించిన పార్టీ అయితే బీజేపీ కేవలం మతపరమైన పార్టీ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణు లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లేశం, శ్రీశైలం, శేఖర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనేవారు లేక.. రైతన్న గోస

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర మార్కెట్ యార్డుల్లో దొరుకుతుందంటూ ఓ వైపు ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా ఆచరణలో మాత్రం లోపాలున్నట్లు స్పష్టమవుతోంది. 2016లో పెద్దశంకరంపేటలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సబ్ మార్కెట్ యార్డులో ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. నాబార్డు నిధులు వెచ్చించి దాదాపు రూ. 4 కోట్లతో 161వ జాతీయ ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మించారు. 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం ఏర్పాటు చేశారు. కేవలం దీనిని గోదాం లాగానే వినియోగిస్తున్నారు తప్ప, కొనుగోళ్లు చేపట్టడం మరిచారు. దీంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన తూకం వృథాగా మారింది.

మార్కెట్ యార్డుగా మారిస్తే మేలు

పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డును పూర్తి స్థాయి మార్కెట్ యార్డుగా మారుస్తానని గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంత రైతులు అప్పట్లో సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా జోగిపేట మార్కెట్ యార్డుకు పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డు అనుబంధంగా ఉంది. అప్పట్లో కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో ఎవరూ దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం మార్కెట్ యార్డుగా మార్చి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తే అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పేట మండలాలకు చెందిన రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం సబ్‌మార్కెట్ యార్డ్ అలంకారప్రాయంగా మారింది. కేవలం సివిల్ సప్లై గోదాంగా మార్చి బియ్యం, వడ్లు మాత్రమే నిల్వ చేస్తున్నారు.

నిరుపయోగంగా పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డు

కరువైన వసతులు

పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డులో సరైన వసతులు కరువయ్యాయి. 161వ జాతీయ రహదారి విస్తరణలో ప్రహరీ కూల్చివేశారు. నష్ట పరిహారం కింద నిధులు మంజూరైనా ఇప్పటికీ ప్రహరీ నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం, రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వసతులు ఏర్పాటు చేసి వినియోగంలోనికి తేవాలని రైతులు కోరుతున్నారు.



పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డ్

కొనుగోళ్లు చేపట్టాలి



ఈ ప్రాంతంలో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, శనగపంటలు సాగవుతాయి. సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేపడితే రైతులకు సరిన్న మద్దతు ధర వచ్చే అవకాశం ఉంటుంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మారుతి, రైతు, పెద్దశంకరంపేట

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డును మార్కెట్ యార్డుగా మార్చే విషయమై ఉన్నతా.దికారులకు నివేదిస్తాం. ధాన్యం కొనుగోలు చేపట్టేందుకు తగిన చర్యలు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– సునీల్, జోగిపేట మార్కెట్ యార్డు సెక్రటరీ

క్లుప్తంగా

టీచర్‌ అసభ్యకర ప్రవర్తనపై విచారణ

పాపన్నపేట(మెదక్‌): మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మహిళా టీచర్‌పై తోటి టీచర్‌ అసభ్యకరంగా ప్రవర్తించాడని వచ్చిన ఆరోపణలపై పాపన్నపేట ఎంఈఓ ప్రతాప్‌ రెడ్డి, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు గురువారం విచారణ జరిపారు. డీఈఓ రాధాకిషన్‌ రావు ఆదేశాల మేరకు విచారణ జరిపి స్థానిక హెచ్‌ఎం, టీచర్లు, మధ్యాహ్న భోజన ఇంప్లిమెంటేషన్‌ ఏజెన్సీ మహిళల నుంచి లిఖిత పూర్వ వివరణ తీసుకున్నట్లు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వివరించారు.

ఆల్‌ ఇండియా క్రీడా పోటీలకు కోహెడ యువకుడు


హరి ప్రసాద్‌

కోహెడ(హుస్నాబాద్‌): ఆల్‌ ఇండియా యూనివర్సిటీ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కోహెడ మండల కేంద్రానికి చెందిన యువకుడు హరిప్రసాద్‌ తెలిపారు. గురువారం యువకుడు మాట్లాడుతూ.. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు పేర్కొన్నారు. టగ్‌ ఆఫ్‌ వార్‌ క్రీడలో ఉస్మానియా యూనివర్సిటీ తరఫున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు 5 నుంచి 9 వరకు పంజాబ్‌లోని లవ్లీన్‌ టెక్‌ స్కిల్స్‌ యూనివర్సిటీలో జరుగనున్నట్లు తెలిపారు. తెలంగాణ మోడల్‌ స్కూల్‌ కోహెడ ప్రిన్సిపాల్‌ కె.నరేందర్‌రెడ్డి ప్రోత్సాహంగా తనకు రూ.10 వేలు అందించారని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి


మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేటఅర్బన్‌: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లిస్తామని కాంగ్రెస్‌ ఇచ్చిన ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్‌ చేశారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కమిటీ సమావేశం సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై గోపాలస్వామి మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు చెల్లిస్తామని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్‌ చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత జీతాలు నెల నెలా ఇవ్వడం లేదని విమర్శించారు. మల్టీపర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్‌, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 7న కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోతే ఏప్రిల్‌ 19 తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వినోద్‌కుమార్‌, జిల్లా నాయకులు ప్రభాకర్‌, రాజమౌళి, కనకయ్య, నరేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

దుబ్బాకరూరల్‌: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని హబ్సిపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్‌ కథనం మేరకు.. కొక్కడగల్ల భాగ్యమ్మ(45) కొద్దిరోజుల కిందట భర్త చెందగా, కూలీ పనులు చేస్తూ జీవిస్తుంది. ఈమెకు ఇద్దరు కుమారులుండగా సిద్దిపేటలో పని చేస్తున్నారు. భాగ్యమ్మ తమ్ముడు పరమేశ్వర్‌ బుధవారం రాత్రి వచ్చి ఆమెతో మాట్లాడిచ్చి తిరిగి ఇంటికి వెళ్లి పోయాడు. పరమేశ్వర్‌ గురువారం ఉదయం వచ్చి చూసే సరికి భాగ్యమ్మ అన్నం తింటూ కూర్చున్న చోటే చనిపోయి ఉంది. చుట్టు పక్కల వారికి, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష ప్రయోగమా.. ఆత్మహత్యా..?

- వృద్ధ దంపతుల అనుమానాస్పద మృతి
- మంత్రాల నెపంతో ఊరు వదిలిన వైనం
- ఏడాది నుంచి వ్యవసాయ క్షేత్రం వద్ద నివాసం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ మధు, రూరల్‌ సీఐ శ్రీను


కొమురయ్య


భూదవ్వ


వృద్ధ దంపతుల మృతదేహాలను పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ శ్రీను

నంగునూరు(సిద్దిపేట): వ్యవసాయ బావి వద్ద నివాసం ఉంటున్న వృద్ధ దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ ఘటన గురువారం సిద్దిపేట జిల్లా నంగునూరులో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆవుల కొమురయ్య (80), భూదవ్వ(70) దంపతులు. వీరికి మంత్రాలు వస్తాయనే అనుమానంతో ఏడాది కిందట గ్రామంలో గొడవ జరిగింది. అప్పటి నుంచి వీరిద్దరూ తమ వ్యవసాయ బావి వద్ద ఉన్న గదిలో నివాసం ఉంటున్నారు. గురువారం తెల్లవారు జామున వారి కుమారుడు పరుశరాములు వచ్చి చూడగా.. తలుపు గడియ పెట్టి ఉండడంతో దాన్ని బద్దలు కొట్టి లోపలికి వెళ్లాడు. తల్లిదండ్రులిద్దరూ మంచంపై విగత జీవులుగా పడి ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సిద్దిపేట ఏసీపీ మధు, రూరల్‌ సీఐ శ్రీను, ఎస్‌ఐ ఆసిఫ్‌ సంఘటన స్థలంలో మృతదేహాలను పరిశీలించారు. కుమారుడు పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాలను సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విష ప్రయోగం చేశారా..?

వ్యవసాయం క్షేత్రం వద్ద ఉంటున్న కొమురయ్య, భూదవ్వ దంపతులపై మంత్రాలు చేస్తారనే అభియోగం ఉంది. ఏడాది నుంచి గ్రామంలోకి రాకుండా వ్యవసాయ క్షేత్రం వద్దే ఉంటున్నారు. తల్లిదండ్రులకు కుమారుడు పరుశరాములు ప్రతి రోజు ఇంటి నుంచి భోజనం తెచ్చి ఇస్తున్నాడు. ఒకే రోజు వృద్ధ దంపతులు మృతి చెందడం, శరీరంపై ఎలాంటి గాయాలు, పెనుగులాడిన ఆనవాళ్లు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భోజనంలో విషం కలిపి చంపారా.. లేక ఆత్మహత్య చేసుకున్నారా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- యాంటీ నార్కోటిక్స్‌ డీఎస్పీ పుష్పన్‌ కుమార్‌
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న పుష్పన్‌కుమార్‌, తదితరులు

నర్సాపూర్‌ రూరల్‌: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని యాంటీ నార్కోటిక్స్‌ డీఎస్పీ పుష్పన్‌ కుమార్‌ సూచించారు. గురువారం నర్సాపూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమాయకంగా ఉండే యువతతోపాటు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారిని డ్రగ్స్‌ ముఠా టార్గెట్‌ చేసుకొని మత్తు పదార్థాలకు అలవాటు చేయడంతో పాటు డబ్బుల ఆశ చూపి వ్యాపారం చేయిస్తారని అన్నారు. తాత్కాలిక సంతోషాల కోసం పొరపాటు చేస్తే బంగారు భవిష్యత్‌ నాశనం అవుతుందన్నారు. నార్కోటిక్‌ డ్రగ్స్‌ అండ్‌ సైకో ట్రోపిక్‌ సబ్‌ స్టాన్సెస్‌ చట్టం 1985 చట్టం చాలా శక్తివంతమైందన్నారు. మత్తు పదార్థాలు సేవించినా, రవాణా చేసినా 10 ఏళ్లకు పైగా జైలు శిక్ష ఉంటుందని సూచించారు. 13 రకాల డ్రగ్స్‌ ను గుర్తించే కిట్లు ప్రతీ పోలీస్‌ స్టేషన్‌ లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ దామోదర్‌, ప్రోగ్రామ్‌ అధికారి సురేశ్‌ కుమార్‌, అధ్యాపక బృందం రమేశ్‌, మహేందర్‌ రెడ్డి, హేమంత్‌ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

హెచ్‌సీయూ భూములు అమ్మొద్దు

నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్‌: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీకి చెందిన భూములు అమ్మొద్దని నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్‌ చేశారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను సీఎం రేవంత్‌రెడ్డి రియల్‌ వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు అమ్మేందుకు చర్యలు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. యూనివర్సిటీ భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు శాంతియుతంగా ఉద్యమిస్తుంటే వారిపై పోలీసులు లాఠీ చార్జి చేయడం విచారకరమన్నారు. ఒక చెట్టు కొట్టాలంటే తహసీల్దార్‌ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా రాత్రికి రాత్రి యూనివర్సిటీ భూముల్లో వందలాది చెట్లను నరికి వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. అలాగే, రాష్ట్రంలో శాంతిభద్రతలు కనుమరుగయ్యాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విదేశీ మహిళపై, రైలులో ప్రయాణిస్తున్న ఓ యువతిపై అఘాయిత్యాలు జరిగాయని, రోజు ఇలాంటి దుర్ఘటనలు జరగడం సర్వసాధరణమైయ్యాయని ఆమె వివరిస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు.

నేడు మంత్రి దామోదర రాక

మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం నర్సాపూర్‌ రానున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు సత్యంగౌడ్‌ నర్సింలు, ప్రసాద్‌, సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, పాషా, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి గోడ కూలి వ్యక్తి మృతి


హిమ్మత్‌ఖాన్‌ మృతదేహం

గజ్వేల్‌రూరల్‌: వర్షానికి ప్రహరీ గోడ కూలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాలిగామ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్‌ పట్టణానికి చెందిన హిమ్మత్‌ఖాన్‌ 45)కి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే హిమ్మత్‌ఖాన్‌ జాలిగామ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ గోదాంలో గురువారం పనికి వెళ్లాడు. వర్షం రావడంతో ప్రహరీ గోడ కూలగా శిథిలాల్లో ఇరుక్కొని హిమ్మత్‌ఖాన్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ

చేగుంట(తూప్రాన్‌): ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన చిట్టోజిపల్లిలోని పరిశ్రమలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. ఛత్తీస్‌ఘడ్‌ రాష్ట్రం సుకుమ జిల్లాకు చెందిన బూంది బగేల్‌(40) చిట్టోజిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న జిటెక్‌ పరిశ్రమలో మేస్త్రీ పనులు చేస్తున్నాడు. పైన పనులు చేస్తున్న క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. తీవ్రగాయాలైన అతడిని నార్సింగి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నీటి గుంటలో పడి గుర్తు తెలియని వ్యక్తి..



జిన్నారం (పటాన్‌చెరు): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బొల్లారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌ రెడ్డి కథనం మేరకు.. బొల్లారంలోని జ్యోతి థియేటర్‌ సమీపంలో 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి వర్షం కురుస్తుండగా మూర్ఛ వ్యాధితో కిందపడ్డాడు. స్థానికులు ఆ వ్యక్తిని అక్కడి నుంచి పంపించారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మల్లన్న బస్తీ సమీపంలో ప్రమాదవశాత్తు చిన్న నీటి గుంటలో పడి మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరో ఇద్దరికి గాయాలు


రమేశ్‌ (ఫైల్‌)

మునిపల్లి(అందోల్‌): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని బుదేరా చౌరస్తా 65వ నంబర్‌ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్‌ నాయక్‌ కథనం మేరకు.. గురువారం బుదేరా గ్రామానికి చెందిన వనంపల్లి రమేశ్‌ (30) అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ఎక్సెల్‌ వాహనంపై టీ తాగడానికి వస్తున్నారు. ఇదే సమయంలో సంగారెడ్డి నుంచి అతివేగంగా వచ్చిన క్వాలీస్‌ వాహనం ఎక్సెల్‌ను, అనంతరం ఇద్దరు పాదాచారులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం


ఎగిసిపడుతున్న మంటలు

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన గుమ్మడిదల మండలం మంబాపూర్‌ గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంబాపూర్‌ సమీపంలోని తిరుమల ఆయిల్‌ క్యాం ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ పేపర్‌ పరిశ్రమలో తెల్లవారుజామున 4 గంటల సమయంలో షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా పేపర్‌ మెటీరియల్‌ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన యాజమాన్యం ఫైర్‌ ఇంజన్లు, స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకోగా ప్రాణహాని జరగలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడదాం

ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ ప్రీతం


పాదయాత్రలో చైర్మన్‌ ప్రీతం, కాంగ్రెస్‌ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు అనేక రకాల కుట్రలు చేస్తోందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ నగరి ప్రీతం ఆరోపించారు. జై బాపు.. జై భీమ్‌.. జై సంవిధాన్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం నుంచి కాన్గల్‌ గ్రామానికి గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ పాలన తీసుకురావాలని ప్రయత్నిస్తోందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్‌ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌ కార్యకర్తలు రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతారని అన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్ర ప్రారంభించారు. తుక్కాపూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాలలు వేసి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. రాజీవ్‌ యువ వికాసం పథకాన్ని విజయవంతం చేయాలని ప్రీతం అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కుల ఆదాయ ధ్రువపత్రాలు త్వరగా అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ పురుషోత్తం. చిత్రంలో డా. హరిబాబు, డా. మధుసూదన్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సునీత, ఐఐటీ ప్రొఫెసర్‌ సుబ్రమణ్యం, డా.అయోధ్యరెడ్డి, డా.గోపాల సుదర్శనం

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

- భవిష్యత్‌ తరాలను కాపాడుకుందాం
- పర్యావరణ జాతీయ సదస్సులో వక్తలు

సిద్దిపేటఎడ్యుకేషన్‌: సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణ భవిష్యత్‌ తరాల మనుగడకు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ వనరులను, జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని ప్రముఖ పర్యావరణ వేత్త, ఓయూ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ పురుషోత్తం సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాలలో పర్యావరణ సమతుల్యత సమగ్రాభివృద్ధి అనే అంశంపై నిర్వహిస్తున్న రెండ్రోజుల జాతీయ సదస్సును కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సునీతతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో వస్తున్న నూతన సాంకేతిక అవశ్యకతను గూర్చి ఐఐటీ హైద్రాబాద్‌ ప్రొఫెసర్‌ సుబ్రమణ్యం, ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాల ఆవశ్యకతపై ఆహార యోగా(ఎన్‌జీఓ) వ్యవస్థాపకుడు సామ ఎల్లారెడ్డి సమగ్రంగా వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 150 పరిశోధన పత్రాలు సదస్సుకు వచ్చాయని కన్వీనర్లు డా.హరిబాబు, డా. అయోధ్యరెడ్డి చెప్పారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సునీత మాట్లాడుతూ.. ఇలాంటి జాతీయ సదస్సులతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, సదస్సు నిర్వాహకులను అభినందించారు. ఇండియన్‌ కౌన్సిల్‌ ఫర్‌ సోషల్‌ సైన్సెస్‌ రీసెర్చ్‌(ఐసీఎస్‌ఎస్‌ఆర్‌) ఆర్థిక సహకారంతో, పొలిటికల్‌ సైన్స్‌, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్‌ సెక్రటరీ డా.మధుసూదన్‌, మెదక్‌ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ హుస్సేన్‌, కళాశాల సీఓఈ డాక్టర్‌ గోపాలసుదర్శనం, అధ్యాపకులు డా.లీలావతి, డా.ఉమామహేశ్వరీ, డా.మహేశ్‌, సుమలత తదితరులు పాల్గొన్నారు.

పరిమితిలోపే ప్రజలకు వైద్యం చేయాలి

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ పల్వన్‌కుమార్‌ హెచ్చరిక


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్‌

సిద్దిపేటకమాన్‌: ఆర్‌ఎంపీ, పీఎంపీలు పరిమితికి లోబడి చికిత్స అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్‌ పల్వన్‌కుమార్‌ తెలిపారు. సిద్దిపేట కలెక్టరేట్‌ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రామ్‌ ఆఫీసర్లతో ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నేటి నుంచి డివిజన్‌ల వారీగా ప్రైవేటు ఆస్పత్రుల పనితీరుపై అధికారులు పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో ఆరోగ్య సేవలకు సంబంధించిన ధరల పట్టికను తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలన్నారు. ఫైర్‌ సేఫ్టీ, బయో మెడికల్‌ వేస్టేజ్‌, వైద్యుల పేర్లు, సిబ్బంది ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు క్లినికల్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌ ప్రకారం నిర్వహించాలని, గడువు ముగిసిన ఆస్పత్రులు రెన్యూవల్‌ చేసుకోవాలన్నారు. స్కానింగ్‌ మెషీన్‌ మార్పిడి, డాక్టర్‌ పేరు మార్పిడికి వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్‌లో ఉన్న వైద్యుడికి బదులు మరొక వైద్యుడు వైద్య సేవలందించే వారిపై చర్యలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పెళ్లి కుదరడంలేదని బలవన్మరణం


సంతోష్‌ మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశివనూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యరెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంతోష్‌ గౌడ్‌(32)కు రెండేళ్లుగా పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో గురువారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడాడు. మృతుడి తండ్రి రమేశ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల గొడవతో మనస్తాపం చెంది

పాపన్నపేట(మెదక్‌): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నార్సింగిలో గురువారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంగలి సత్తయ్య, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నరేశ్‌ కుమార్‌(26) పీజీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. కొద్దిరోజులుగా తల్లిదండ్రుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవలతో మనస్తాపం చెందిన నరేశ్‌ కుమార్‌ బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అదృశ్యమైన మహిళ మృతదేహమై లభ్యం

నర్సాపూర్‌ రూరల్‌: అదృశ్యమైన గిరిజన మహిళ కుళ్లిన మృతదేహమై లభ్యమైంది. నర్సాపూర్‌ ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌ మండలం ఎల్లారెడ్డి గూడ పంచాయతీ పరిధిలోని జయరామ్‌ తండాకు చెందిన మెగావత్‌ భుజాలీ (52) గత నెల 25న నర్సాపూర్‌లో ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో 26న ఆమె కుమారుడు కుమార్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సాపూర్‌–మెదక్‌ జాతీయ రహదారిలోని నర్సాపూర్‌ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. అక్కడికి వెళ్లి చూసి జయరామ్‌ తండాకు చెందిన భుజాలీగా గుర్తించారు. క్లూస్‌ టీమ్‌తో పరిశీలించి దర్యాప్తు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎండు గంజాయి, నాటు తుపాకీ పట్టివేత

ఒకరు రిమాండ్‌, పరారీలో మరో ఇద్దరు


మాట్లాడుతున్న సీఐ నయీముద్దీన్‌

జిన్నారం (పటాన్‌చెరు): ఎండు గంజాయితోపాటు నాటు తుపాకీ, రెండు బుల్లెట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిన్నారం సీఐ నయీముద్దీన్‌ కథనం మేరకు.. బీహార్‌ రాష్ట్రానికి చెందిన భూపేందర్‌ కుమార్‌ శర్మ (24) గుమ్మడిదల మున్సిపాలిటీ దోమడుగు గ్రామంలో పదేళ్లుగా ఉంటున్నాడు. ఇదే రాష్ట్రానికి చెందిన మిథున్‌ ఆరేళ్లుగా దోమడుగు గ్రామంలో అద్దెకుంటూ క్యాంపిస్టిన్‌ పరిశ్రమల కార్మికులుగా పని చేస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఇద్దరూ కలిసి అప్పుడప్పుడూ సొంత రాష్ట్రానికి వెళ్లి ఎండు గంజాయిని తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో పారిశ్రామిక వాడలో విక్రయిస్తున్నారు. గతేడాది అక్టోబర్‌ నెలలో భూపేందర్‌ కుమార్‌ శర్మ సొంత రాష్ట్రానికి వెళ్లి పక్క గ్రామానికి చెందిన రోహిత్‌ అనే వ్యక్తి దగ్గర తపంచా నాటు తుపాకీతోపాటు రెండు గుండ్లు కొనుగోలు చేశాడు. దోమడుగు గ్రామంలో అద్దె ఇంట్లో వాటిని భద్రపరిచాడు. మిథున్‌ బీహార్‌ కు వెళ్లి ఎండు గంజాయిని తీసుకొచ్చి శర్మకు ఇవ్వగా వాటిని ఇంట్లో దాచాడు. గురువారం గుమ్మడిదల పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 930 గ్రాముల ఎండు గంజాయితోపాటు, నాటు తుపాకీ, రెండు బుల్లెట్లు గంజాయి ప్యాకింగ్‌ చేయడానికి వాడే వేయింగ్‌ మిషన్‌, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్‌ చేసి భూపేందర్‌ కుమార్‌ శర్మను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు మిథున్‌, రోహిత్‌ పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామన్నారు.

ధర పడిపోయి.. టమాటా చితికిపోయి

జహీరాబాద్‌ మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన రాములు అనే రైతు రెండు ఎకరాల్లో టమాటా పంట వేశాడు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట ఆశాజనకంగా ఉంది. కానీ పంట చేతికందుతున్న సమయంలో ధరలు పడిపోవడంతో నష్టపోవాల్సి వస్తుంది.

ఝరాసంగం మండలంలోని కంబాలపల్లి గ్రామ రైతు తెనుగు శ్రీనివాస్‌ రెండు ఎకరాల్లో టమాటా పంట వేశాడు. సుమారు రూ. 60 వేలకు పైగా పెట్టబడి పెట్టాడు. ధరలు పతనం కావడంతో నష్టపోయాడు. కూలీ, రవాణా చార్జీలు కూడా రావడం లేదు. ఇలా జహీరాబాద్‌ నియోజకవర్గంలో టమాటా పంట పండిస్తున్న రైతుల పరిస్థితి ఉంది. వేల రూపాయల పెట్టుబడులు పెట్టినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- కిలో రూ.10 అయినా ఎవరూ కొనని పరిస్థితి
- పెట్టుబడులు కూడా రాక రైతుల ఆందోళన
- పొలాల్లో వదిలేస్తున్న పంట


పొలంలోనే వదిలేసిన టమాటా

జహీరాబాద్‌ టౌన్‌: జిల్లాలో సుమారు 560 ఎకరాల్లో టమాటా పంట ఉంటుంది. టమాటా నారు అందుబాటులో ఉండడం వల్ల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. పడిపోయిన ధరల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జహీరాబాద్‌ మార్కెట్‌కు లోకల్‌ టమాటాతోపాటు మహారాష్ట్ర నుంచి టమాటా వస్తుంది. డిమాండ్‌ కన్న దాదాపు రెట్టింపు రావడం వల్ల ధరలు పడిపోవడానికి కారణమవుతుంది. ఒక్కసారిగా పంట చేతికిరావడంతో ధరలు పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో రూ.10 అయినా ఎవరూ కొనడానికి ముందుకు రావడంలేదు. కూలీలు, రవాణా ఛార్జీలు మీద పడుతున్నాయని కొంత మంది రైతులు పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. దీంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు.